# అమ్మపాలు అమృతం



సీఎస్‌పురం: తల్లిపాల ప్రాముఖ్యంపై అవగాహన ర్యాలీ చేస్తున్న ఎంపీడీఓ, డాక్టర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్


గర్భిణులకు శ్రీమంతం చేస్తున్న మండల స్థాయి అధికారులు

**పామూరు:** అమ్మపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గోళ్ల పద్మజ, ఎంపీఎస్ పార్వతి, సర్పంచ్ బద్దిపూడి శారమ్మ అన్నారు. తల్లి పాల వారోత్సవాలు పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రమైన పామూరు పవర్ ఆఫీస్, ఇస్లాంపేట, మండలంలోని చట్టుమడుగు గ్రామాల్లో నిర్వహించారు. తల్లి ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకాతో సమానమని తెలిపారు. ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కిశోరబాలికలకు పరిశుభ్రతపై వివరించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు తల్లిపాలు, పౌష్టికాహార ఆవశ్యకతను వివరించి అవగాహన ర్యాలీ చేపట్టారు. మహిళా పోలీస్ అనూష, ఎస్‌కే రమీజాబి, షేక్ రూహి, కుమారి, లక్ష్మీప్రసన్న, సంపూర్ణ, షంషాద్, కొండమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

**లింగసముద్రం:** తల్లిపాలే బిడ్డకు అత్యంత శ్రేష్టమైనవని, ఆరోగ్యవంతమైనవని లింగసముద్రం సెక్టార్ సూపర్‌వైజర్ రాధాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని మొగిలిచర్ల–2 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించటం వల్ల వారిలో రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాలలో పోషకాలు అధికంగా ఉంటాయని, అవి బిడ్డ ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడతాయని తెలియజేశారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మార్తమ్మ, శ్రీదేవి, ప్రసన్న, ఓబులమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

**సీఎస్‌పురం (పామూరు):** కాన్పు తరువాత తల్లి మొదటగా బిడ్డకు ఇచ్చే ముర్రుపాలు టీకాతో సమానమని ఎంపీడీఓ సీహెచ్ రామచంద్రరావు, డాక్టర్ సందిరెడ్డి మురళి అన్నారు. మండలకేంద్రమైన సీఎస్ పురంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.దేవకృపావరం అధ్యక్షతన మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ, డాక్టర్ మాట్లాడుతూ గర్భిగా ఉన్న సమయంలో క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని తద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డ జననం జరుగుతుందన్నారు. బిడ్డ పుట్టిన తరువాత మొదట ముర్రుపాలు ఇవ్వడంతోపాటు నిత్యం తల్లిపాలే బిడ్డకు ఇవ్వాలని తద్వారా బిడ్డలు ఆగోగ్యవంతంగా ఉంటారన్నారు. ఈసందర్భంగా బిడ్డకు తల్లి పాలు ఇచ్చే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డాక్టర్ హోమద్యుతి, సీహెచ్‌ఓ ఆవుల మురళి, సరళారెడ్డి, వైద్యసిబ్బంది మల్లీశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

**వలేటివారిపాలెం:** మండలంలోని బడేవారిపాలెంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో సీడీపీఓ షర్మిస్తా ఆదేశాలు మేరకు రెండో సెక్టార్ సూపర్‌వైజర్ సునీత అధ్వర్యంలో ప్రపంచ తల్లి పాలు వారోత్సవాలు ఐదో రోజు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు మండలంలోని ప్రతి ఒక అంగన్‌వాడీ సెంటర్‌లో వారం రోజులు నిర్వహిస్తామని తెలిపారు. పుట్టిన ప్రతి బిడ్డకూ మొదటి ఆహారం తల్లి పాలు అన్నారు. అంతరాలను పూరించి తల్లి పాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం అనే నినాదంతో తల్లి పాలు వారోత్సవాలు జరుపుకుందామన్నారు. గర్భిణులు, బాలింతలకు, మూడు సంవత్సరాల తల్లులకు, కిశోర బాలికలకు తల్లి పాలు గురించి అవగాహన కల్పించారు. బాలింతలు ఆరు నెలలు వరకు తల్లి పాలు ఇవ్వాలని, ఆరు నెలలు నిండిన బిడ్డకు తల్లి పాలతో పాటు అనుబంధ పోషకాహారం బిడ్డలకు అందించాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ మనోహర, రమాదేవి, హెల్పర్ సుశీల, హెల్పర్లు, బాలింతలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

**పీసీపల్లి:** తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జరీనా తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని నేరేడుపల్లిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క తల్లి తనకు పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాగించాలన్నారు. దాదాపు 24 నెలల వరకు ముర్రుపాలు తాగించవచ్చన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశీర్వాదం, సింగమ్మ, నాగరత్నమ్మ, వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ విజయలక్ష్మి ఉన్నారు.

**తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం**

**కొండపి(సింగరాయకొండ):** తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని కొండపి ఐసీడీఎస్ సీడీపీఓ డి.మాధవీలత పేర్కొన్నారు. మంగళవారం కొండపిలోని ప్రాజెక్టు కార్యాలయంలో మండల స్థాయి తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీవో నాగమణి, పీహెచ్సీ వైద్యురాలు అనూష, ఎంఈఓ సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ, నవజాత శిశువులు ఆరోగ్యంగా పెరగడానికి తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. వైద్యురాలు అనూష మాట్లాడుతూ.. ఆరు నెలలపాటు శిశువుకు రోజుకు 12 సార్లు పాలు తాగించాలని, స్థూలకాయం వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని, డబ్బా పాలు పట్టించవద్దని చెప్పారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. పిల్లలకు పాలిస్తే భవిష్యత్తులో రొమ్ము క్యాన్సర్లు, మధుమేహం వచ్చే అవకాశం చాలా తక్కువగా ఉంటుందన్నారు. అనంతరం 15 మంది గర్భిణులకు శ్రీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


బడేవారిపాలెంలో తల్లి పాల వారోత్సవాలు


పామూరు: గర్భిణులు, బాలింతలకు సూచనలిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ


పీసీపల్లి: తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు


మొగిలిచర్లలో తల్లిపాల గురించి అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రాధాదేవి

## క్లుప్తంగా

### సాఫ్ట్ బాల్ జట్టుకు ఇద్దరు విద్యార్థినులు ఎంపిక


జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థులు

**టంగుటూరు:** ఒంగోలు ఏబీఎం జూనియర్ కళాశాలలో జూలై 26న ఎంపిక చేసిన జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ బాలికల జట్టులో టంగుటూరు మండలం మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని సుధారాణి, 9వ తరగతి విద్యార్థిని జి.కీర్తనకు చోటు దక్కిందని పీపీ కౌసల్య మంగళవారం తెలిపారు. వీరు ఆగస్టు 10 నుంచి 12వ తేదీ వరకు గుంటూరు జిల్లా వినుకొండలో నిర్వహించనున్న 10వ సీనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు నరసరాజు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

### ఈ–క్రాప్‌తో రైతులకు ప్రయోజనం


అలకూరపాడులో పచ్చిరొట్ట పైర్లను పరిశీలిస్తున్న ఏఓ స్వర్ణలత

**టంగుటూరు:** రైతులు సాగు చేసిన పంటల వివరాలు ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి స్వర్ణలత సూచించారు. మండలంలోని ఆలకూరపాడులో పచ్చిరొట్ట పైర్లు, నువ్వుల పంటలను ఏఓ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. పచ్చి రొట్ట పంటలతో భూసారం పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. పంటల బీమా, అనదాత సుఖీభవ తదితర పథకాలకు ఈ–క్రాప్ వివరాలే ప్రామాణికమని తెలిపారు. కౌలు రైతులు గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. చిరుధాన్యాల సాగు చేయాలని రైతులను కోరారు. వ్యవసాయ సిబ్బంది, ఆలకూరపాడు గ్రామ రైతులు పాల్గొన్నారు.

### పీసీపల్లి తహసీల్దార్‌గా ఉష


తహసీల్దార్ ఉషను అభినందిస్తున్న సిబ్బంది

**పీసీపల్లి:** నూతన తహసీల్దార్‌గా ఉషా నియామకమయ్యారు. ఈ మేరకు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో భూ సమస్యలపై ప్రత్యేక దృష్టిపెడుతున్నట్లు, పౌరసేవలు త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెకు అభినందించారు.

### మౌలిక వసతులు కల్పించాలి


ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు

**కనిగిరి:** ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్‌లో కనీస మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ఎస్ఐఎస్ఎఫ్ సభ్యులు మంగళవారం కనిగిరి ఆర్డీఓ జాన్ ఇర్విన్‌కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ఎస్ఐఎస్ఎఫ్ పిలుపు మేరకు కనిగిరి ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్‌ను పరిశీలించామన్నారు. తాగు నీటి సమస్య ఉందని.. పెట్టెలు, ఫ్యాన్లు లేవని, సరిపడా లైటింగ్ వాచ్‌మెన్లు, సిబ్బంది లేదని తెలిపారు. అఖిల భారత విద్యార్థి సభ్యులు పాల్గొన్నారు.

### ట్రాక్టర్ ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో గాయపడిన వెంకటేష్

**ఉలవపాడు:** ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తిని మలుపు తిరుగుతున్న ట్రాక్టర్ ఢీ కొనడంతో ద్విచక్రవాహనదారునికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం జాతీయరహదారి పై రాజుపాలెం జంక్షన్ వద్ద జరిగింది. గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన వెంకటేష్ సత్తెనపల్లి నుంచి తిరుపతికి ద్విచక్రవాహనంపై వెళుతున్నాడు. రాజుపాలెం జంక్షన్ వద్దకు వచ్చేసరికి మలుపు తిరుగుతున్న ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించాలి


మాట్లాడుతున్న వీరారెడ్డి

**కొండపి(సింగరాయకొండ):** కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనాలు చేకూర్చలేదని సీపీఐ కొండపి నియోజకవర్గ కార్యదర్శి కె.వీరారెడ్డి విమర్శించారు. మంగళవారం కొండపిలోని కూనంనేని రాములు భవన్‌లో కొచ్చర్ల మాలకొండయ్య అధ్యక్షతన పార్టీ కొండపి మండల సమితి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీరారెడ్డి మాట్లాడుతూ.. పోలవరం ముంపు బాధితులకు నష్టపరిహారం, ప్రాజెక్టు నిర్మాణానికి బడ్జెట్లో నిధుల కేటాయింపు ఊసే లేకపోవడం దుర్మార్గమన్నారు. రాజధాని నిర్మాణానికి కేటాయించిన రూ.15 వేల కోట్లు అప్పు ఇప్పిస్తామని కేంద్రం చెబుతుంటే కూటమి ప్రభుత్వం మాత్రం గ్రాంట్‌గా ప్రచారం చేసుకోవడాన్ని తప్పుబట్టారు. ఆంధ్రప్రదేశ్లో పరిశ్రమలు స్థాపించాలన్నా, నిరుద్యోగ సమస్య పోవాలన్నా ప్రత్యేక హోదా ఎంతో అవసరమన్నారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ముంపు బాధితులకు పునరావాస ఏర్పాట్లు సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లను బాగు చేయించి సాగర్ నీటితో నింపాలని, ఆయకట్టు రైతులకు సాగునీరు, పల్లెలకు తాగునీరు అందించాలన్నారు. సంగమేశ్వర ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలని, పాలేరు నదిపై జిల్లెల్లమూడి దగ్గర ఆనకట్టలో పూడిక తీసి మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. కొండేపి చెరువులో కలపను నరికి అక్రమంగా తరలించిన వారిపై పోలీసు కేసు నమోదు చేయాలని, కర్ర స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే వ్యవసాయ సీజన్‌కు అవసరమైన ఎరువులు, విత్తనాలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి గద్దల బాలకోటయ్య, మండల కార్యదర్శి లక్ష్మి, ప్రసాద్, చంద్రయ్య, ఖాసీం, బ్రహ్మయ్య, యలమంద, సాయి, జాలయ్య, సుబ్బారావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 816 పొగాకు బేళ్లు కొనుగోలు


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు


కొండపిలో వేలాన్ని పర్యవేక్షిస్తున్న సునీల్ కుమార్

**టంగుటూరు:** స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం 816 బేళ్లు కొనుగోలయ్యాయి. పొందూరు క్లస్టర్ గ్రామాల రైతులు 867 బేళ్లను వేలానికి ఉంచగా వ్యాపారులు వివిధ కారణాలతో 51 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.358, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.309.75 పలికింది. వేలంలో మొత్తం 45 మంది వ్యాపారులు పాల్గొన్నారు. వేలం సందర్భంగా రైతులు ఎవరూ అనధికారిక బ్యార్నీలు నిర్మాణం, అధిక కౌలుకు బ్యార్నీలు,పొలాలు లీజుకు తీసుకోవద్దనివేలంనిర్వహనాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

**పొగాకు గరిష్ట ధర రూ.359**

**కొండపి(సింగరాయకొండ):** కొండపి వేలం కేంద్రంలో మంగళవారం పొగాకు గరిష్ట ధర కేజీ రూ.359 పలికింది. అనకర్లపూడి, పెరిదేపి, మిట్టపాలెం, ముప్పరాజువారిపాలెం గ్రామాల రైతులు 1000 బేళ్లను వేలానికి ఉంచగా అందులో 864 కొనుగోలయ్యాయి. కనిష్ట ధర రూ.204, సరాసరి ధర రూ.286.87 పలికింది. వేలంలో 18 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు.

## అక్రమ బ్యారన్లు నిర్మించవద్దు

- టుబాకో బోర్డు ఆర్‌ఎం లక్ష్మణరావు సూచన


రైతులతో మాట్లాడుతున్న ఆర్‌ఎం లక్ష్మణరావు

**కొండపి(సింగరాయకొండ):** అనధికారికంగా పొగాకు బ్యారన్లు నిర్మించరాదని టుబాకో బోర్డు ఒంగోలు ప్రాంతీయ అధికారి లక్ష్మణరావు సూచించారు. మంగళవారం కొండపిలో వేలం తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ.. బోర్డ్ అనుమతించిన మేరకే పొగాకు పంట సాగు చేయాలని, పొగాకును బయట కొనుగోలు చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. వేలంలో అన్ని గ్రేడ్లకు మంచి ధర ఇవ్వాలని వ్యాపారులకు సూచించారు. పచ్చిరొట్ట పైర్లతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో బోర్డు మెంబర్ బొడ్డపాటి బ్రహ్మయ్య, వేలం నిర్వహణాధికారి సునీల్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులు ప్రారంభించాలి


సీపీఎం నాయకులు, కూలీలతో మాట్లాడుతున్న ఊసా వెంకటేశ్వర్లు

**సీఎస్‌పురం (పామూరు):** మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో తక్షణం ఉపాధిహామీ పథకం పనులు ప్రారంభించి కూలీలను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండలంలోని నల్లమడుగులలో మంగళవారం సీపీఎం గ్రామ కమిటీ సమావేశం, ఉపాధి కూలీలతో ఆయన సమావేశం నిర్వహించారు. నల్లమడుగుల సీపీఎం పార్టీ గ్రామ కార్యదర్శి గుడిగుంట్ల ఏసుదాస్ మాట్లాడుతూ నల్లమడుగులకు కోవిలంపాడు పంచాయతీ కార్యదర్శిని ఇన్‌చార్జ్‌గా వేశారని సకాలంలో ఆయన అందుబాటులో ఉండక పోవడంతో పనులకోసం వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారని నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. మండల కార్యదర్శి ఊసా మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూలీలకు పనులు కల్పించడంలో అలసత్వం వహిస్తున్నారన్నారు. వర్షాలు పడి పనికి అనుకూలంగా ఉన్నరోజుల్లో ఉపాధి పనులు నిలిపివేయడం సరికాదన్నారు. షేక్ అజీద్ బాష, సూరిపోగు నారయ్య, పలువురు పాల్గొన్నారు.

## విద్యతోనే గుర్తింపు సాధ్యం


రాష్ట్ర స్థాయి ర్యాంకర్ల మెమెంటోలు అందజేస్తున్న ఎమ్మెల్యే, కరస్పాండెంట్

**పామూరు:** విద్యతోనే సమాజంలో గుర్తింపు సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక ఫంక్షన్ హాలులో మంగళవారం అక్షణ డిగ్రీ, జూనియర్ కళాశాలల ఫ్రెషర్స్‌డే వేడుకలు సీపీ కదిరి బాబూ రాంగారావు, సత్యప్రసాద్‌ల అధ్యక్షతన జరిగాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలన్నారు. ఈసందర్భంగా ఇంటర్మీడియెట్‌లో రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముందుగా కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఆయనను ఘనంగా సన్మానించారు. డాక్టర్ గద్దే యేడుకొండలు, పువ్వాడి వెంకటేశ్వర్లు, రామారావు, యారవ శ్రీనివాసులు, యం.హుస్సేన్‌రావు, బొల్లా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ట్రంకు రోడ్డులో గోతులు


సింగరాయకొండ-నరసింశ్రేష్టి అడితి రోడ్డు సెంటర్‌లో రహదారిపై గోతులు

**సింగరాయకొండ:** మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతులతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం నీరు డ్రెయినేజీలోకి వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోకపోవడంతో స్వల్ప వర్షం కురిసినా నీరు రోడ్డుపై నిలిచిపోతోంది. సుమారు ఐదు నెలల క్రితం ఆర్‌అండ్‌బి అధికారులు గోతులు పూడ్చారు. అయితే ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకు మళ్లీ గోతులు ఏర్పడి నీరు నిలిచాయి. గోతులు ఉన్న విషయం గ్రహించలేని వాహనదారులు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. ప్రధానంగా ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, నరసింహశ్రేష్టి అడితి రోడ్డు సెంటర్, కూరగాయల మార్కెట్ ప్రాంతంలో గోతులు ఎక్కువగా ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

### నీటి సమస్య తలెత్తకుండా చర్యలు


అర్బన్ కాలనీలో బోరు పరిశీలిస్తున్న మున్సిపాల్ చైర్మన్ గఫార్

**కనిగిరి:** కనిగిరి ప్రజలకు తాగు నీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. మంగళవారం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ కాలనీలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కనిగిరి పట్టణ ప్రజలకు నీటి అవసరాలు తీర్చేందుకు ప్రస్తుతం ఉన్న బోరు పాయింట్ల ద్వారా వచ్చే నీరు సరిపోవడం లేదని తెలిపారు. దీంతో గతంలో వినియోగంలో ఉండి ప్రస్తుతం వినియోగంలో లేకుండా ఉన్నా బోర్లను పరిశీలించేందుకు అర్బన్ కాలనీలో పరిశీలించామన్నారు. 20 వార్డుల్లో పట్టణ ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసిందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మున్సిపాల్ డీఈ వేణుగోపాల్, పబ్లిక్ హెల్త్ ఏఈ శ్రీరామ్మూర్తి, అహ్మద్ పాల్గొన్నారు.

### చీడపీడల నివారణతో మేలైన దిగుబడి


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

**ఉలవపాడు:** చీడపీడల నివారణతో వేరుశనగలో అధిక దిగుబడి సాధించవచ్చని కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త ప్రసాద్ బాబు తెలిపారు. మంగళవారం స్థానిక కరేడు పంచాయితీ పరిధిలోని అలగాయపాలెం, టెంకాయచెట్లపాలెంలోని వేరుశనగ రైతులకు సమగ్రపోషకాలు, సస్యరక్షణపై అవగాహన కల్పించారు. కందుకూరు ఏడీఓ అనసూయ మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు ఈ పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. శాస్త్రవేత్తలు వెంకటేష్, జ్యోతి మయాంక్, వ్యవసాయాధికారి తిరుమల జ్యోతి, రైతు సేవా కేంద్రం సిబ్బంది వంశి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### స్వాతంత్ర్య వేడుకలకు ఎన్‌సీసీ విద్యార్థి ఎంపిక


లిఖిత్‌కుమార్

**కందుకూరు:** ఈనెల 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు విజయవాడలో జరగనున్న లోకల్ ఇండిపెండెన్స్ డే క్యాంప్‌నకు ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన ఎన్‌సీసీ విద్యార్థి ఎంపికయ్యారని కాలేజీ కరస్పాడెంట్ కంచర్ల రామయ్య మంగళవారం తెలిపారు. లోకల్ ఇండిపెండెన్స్ డే క్యాంప్ సెలక్షన్స్ గుంటూరులో జరిగాయని, వీటిలో సీనియర్ డివిజన్ విభాగం నుంచి తమ కాలేజీకి చెందిన విద్యార్థి డి. లిఖిత్‌కుమార్ ఎంపికయ్యారని చెప్పారు. వరుసగా మూడు సంవత్సరాల నుంచి తమ కాలేజీకి చెందిన విద్యార్థులు ఈ క్యాంప్‌కు ఎంపిక కావడం తమకు గర్వకారణమన్నారు.

### కఠిన చర్యలు తప్పవు


హాజీపురం అడ్డరోడ్డు వద్ద తనిఖీ చేస్తున్న ఎస్సై

**హనుమంతునిపాడు:** మద్యం సేవించి వాహనాలు నడిపినా.. బహిరంగంగా మద్యం సేవిస్తున్నా కఠిన చర్యలు తప్పవని ఎస్సై కె.శివనాగరాజు అన్నారు. మంగళవారం కంభం కనిగిరి రహదారి హాజీపురం అడ్డ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. మద్యం సేవించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### గద్దర్‌కు ఘన నివాళి


గద్దర్‌కు నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

**టంగుటూరు:** టంగుటూరు బొమ్మల సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద గద్దర్‌కు అన్ని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన ప్రజా ఉద్యమాలకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తుల్లిబిల్లి అశోక్‌బాబు, పాలేటి కోటేశ్వరరావు, చప్పిడి వెంగళరావు, వై.క్రాంతి, జై భీమ్ పీపుల్ జేఏసీ కొండలరావు, బొడ్డు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

### పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకోండి

**హనుమంతునిపాడు:** పండ్ల తోటల సాగుకు ఆసక్తి ఉన్న సన్న చిన్న కారు రైతులు ఈ నెల 10 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కె.లలిత అన్నారు. మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా దాసళపల్లి గ్రామంలో సాగు చేసిన నిమ్మ తోట మొక్కలను ఎంపీడీఓ, ఏపీఓలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు పండ్ల తోటల సాగుకు 35 మంది రైతులు దరఖాస్తులు చేశారు. వారిలో 7 మంది రైతులకు సాగుకు అనుమతి వచ్చిందన్నారు. మిగిలిన వారికి కూడా త్వరలో అనుమతి వస్తుంది.

### 58 మందికి వైద్య పరీక్షలు

**హనుమంతునిపాడు:** మండల పరిధిలోని కూటాగుండ్ల గ్రామాల్లో మంగళవారం 104 వాహనం ద్వారా ఇంటింటి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 58 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సందీప్ కుమార్ పరీక్షలు నిర్వహించిన అనంతరం మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులుతో బాధపడుతున్న వారికి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో 104 వైద్య సిబ్బంది, ఏఎస్ఎంలు, ఎంఎల్ హెచ్‌పీలు, ఆశలు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


ఆశ వర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్‌ఓ

**హనుమంతునిపాడు:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా 14 ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు అప్రమత్తంగా ఉండాలని కమ్యూనిటీ హెల్త్ అధికారి కె.చెన్నయ్య అన్నారు. మంగళవారం స్థానిక సీహెచ్‌సీలో ఆశాలకు, ఏఎన్‌ఎంలకు, ఎంఎల్‌హెచ్‌పీలకు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటుకు గురవకుండా ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. దోమవలన సోకే డెంగీ, టైఫాయిడ్, మలేరియా సోకుతాయన్నారు. ప్రాణాంతక వ్యాధులు కంఠసర్పి, కామెర్లు, ధనుర్వాతం వంటి వ్యాధులు సోకకుండా ముందస్తుగా వ్యాధి నివారణ టీకాలు చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశలు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.